క్లుప్తంగా

హోంగార్డుల సమస్యలు ప్రస్తావిస్తా



ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

వట్‌పల్లి(అందోల్): అసెంబ్లీ సమావేశాల్లో హోంగార్డుల సమస్యలను ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన హోంగార్డులు తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్ఏల మాదిరిగానే మమ్మల్ని కూడా పర్మినెంట్ చేసేవిధంగా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీనిచ్చినట్లు హోంగార్డులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



బస్‌పాస్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): బీఆర్ఎస్‌తోనే కంగ్టి మండల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తడ్కల్ నుంచి నారాయణఖేడ్‌కు బస్సు సౌకర్యాలన్ని మంగళవారం పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడ్కల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ఆర్ఎం సుదర్శన్ ఆదేశాల మేరకు తడ్కల్‌కు బస్సును పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం మల్లేషయ్య, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, యూనియన్ అధ్యక్షులు నెహ్రూ, సర్పంచ్ మనోహర్, ఎంపీటీసీ శ్రీకాంత్, నారాయణ, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాజీ సైనికుడు శివరాం అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో మంగళవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు అద్భుతాలను సృష్టిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీపతిగూడెంలో దళితబంధు బహిష్కరిస్తాం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని లక్ష్మీపతిగూడెం గ్రామ దళితులు మంగళవారం ఎంపీడీఓ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దళితబంధు పథకానికి అర్హులైన వారికి కాకుండా అనర్హులకు ఎంపిక చేస్తున్నారని వాపోయారు. గ్రామంలో 50 దళిత కుటుంబాలు ఉన్నాయని, అర్హులైన వారిని గుర్తించాలన్నారు. అనర్హులకు దళితబంధు ఇస్తే గ్రామంలో దళితబంధును బహిష్కరిస్తామని హెచ్చరించారు. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి నల్లగండ్ల శంకర్ అనే దళితుడి స్థలాన్ని తీసుకొని ఇప్పటివరకు అతడికి ఎలాంటి న్యాయం చేయడంలేదన్నారు. అధికారులు స్పందించి శంకర్ కుటుంబానికి ఇంటి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్, సతీష్, నరేందర్, నవీన్, నరేష్, విజయ్, శివకుమార్, రాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టులో వివిధ క్రీడాపోటీలను జిల్లా న్యాయమూర్తి సుదర్శన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడలకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సంఘం సభ్యులు మహేష్, కృష్ణ క్రీడల కార్యదర్శి మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, అరుణకుమారి, రామిరెడ్డి పాల్గొన్నారు.

రూ.లక్ష సహాయానికి దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు: ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయానికి నియోజకవర్గ పరిధిలోని అర్హులైన క్రిస్టియన్స్, మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 14వ తేదీలోపు www.tsobmmrgov.in వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. ఏ మైనా సందేహాలుంటే జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కూలీల కొరత.. రైతుల వెత

- వర్షాలతో పంటపొలాల్లో పెరుగుతున్న గడ్డి
- కూలీల కొరత తగ్గించుకునేందుకు పిచికారీ మందులపై ఆసక్తి
- పెట్టుబడులను ఆదా చేసే దిశగా రైతుల ప్రయత్నాలు



గడ్డిమందుతో పిచికారీ చేయగా ఎర్రబారిన గడ్డి

మునిపల్లి(అందోల్): ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు పత్తి, పెసర, మినుము తదితర పంటలను సాగు చేస్తున్నారు. విత్తనాలు నాటిన నుంచి తరచూ వర్షాలు కురుస్తుండటంతో పంట చేలల్లో పిచ్చిగడ్డి ఏపుగా పెరిగిపోతోంది. దీంతో కలుపుతీత పనులకు కూలీల కొరత ఏర్పడింది. పత్తి పంటలో కూలీలతో కలుపు తీసేందుకు గడ్డిని బట్టి ఎకరాకు రూ.2వేల నుంచి 3,500 వరకు ఖర్చు వస్తుండటంతో కూలీల కొరతను నివారించుకునేందుకు రైతులు తక్కువ ధరలకు దొరికే గడ్డి నివారణ మందులను ఆశ్రయిస్తున్నారు.

పిచికారీ పనుల్లో రైతులు నిమగ్నం

సోయ, పెసర, మినుము, కంది, పత్తి తదితర పంటల్లో పెరిగిపోయిన గడ్డిని తొలగించేందుకు ఫర్టీలైజర్ దుకాణాల్లో లభించే గడ్డి నివారణ రసాయన మందులను కొనుగోలు చేస్తూ పిచికారీ చేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. దీంతో గడ్డి మందుతో పిచికారీ చేసిన అతి తక్కువ రోజుల్లోనే గడ్డి పూర్తిగా ఎర్రబారి ఎండిపోతుండటంతో కూలీల కొరత తగ్గడమే కాకుండా తక్కువ ధరలకు గడ్డి మందులు లభిస్తుండటంతో రైతులు వీటిపై ఆసక్తిని చూపుతున్నారు.

పంట ఎదుగుదల బాగుంది



కలుపుతీత పనులకు కూలీల కొరత ఉండడంతో గడ్డి మందు పత్తి, కంది సాళ్లలో పిచికారీ చేస్తున్నా. గడ్డి ఎండిపోవడమే కాకుండా ఎలాంటి నష్టం లేకుండా పత్తి పంట ఎదుగుదల బాగుంది. అన్ని రకాల పంటల్లో పిచికారీ చేసేందుకు గడ్డి మందులను అందుబాటులో ఉంచితే రైతులకు ఇబ్బంది ఉండదు.

– గంజి నారాయణ, రైతు, హస్నాబాద్

దుబార ఖర్చు తగ్గింది



కూలీలతో కాకుండా 10 ఎకరాల పత్తి పంటలో గడ్డి మందుతో పిచికారీ చేస్తే రూ.15వేల ఖర్చు అయింది. అదే కూలీలతో పని చేయిస్తే రూ.30వేలతో ఎక్కువ ఖర్చు వచ్చేది. గడ్డి మందు కొనుగోలు చేసి పిచికారీ చేయడంతో దుబార ఖర్చు తగ్గింది. గడ్డి నివారణ మందులపై అధికారులు అవగాహన కల్పించాలి.

– పండరి, రైతు, పెద్దలోడి

కలుపుతీతతోనే ఉపయోగం



వివిధ రకాల పంటలలో గడ్డిని నివారించాలంటే కలుపుతీతనే ఎక్కువగా ఉపయోగం ఉంటుంది. కలుపుతీత ద్వారా మొక్కలకు బలం చేకురుతుంది. గడ్డి మందు తాత్కాలికంగా ఉపయోగం ఉన్న శాశ్వత పరిష్కారం కాదు. పంట దిగుబడి సాధించాలంటే కలుపుతీత పనులు చేయాలి.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆయిల్‌పాం సాగుతో దిగుబడి

ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఆయిల్ పాం పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మొగుడంపల్లి మండలంలోని గౌటిగార్‌పల్లి గ్రామంలో అయిల్ ఫాం మొక్కను నాటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ యాజమాన్యం ఆయిల్ పాం మొక్కలను సబ్సిడీపై అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్, ఉద్యానవన మాజీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, ఉద్యానశాఖ రాష్ట్ర సలహాదారు శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, సర్పంచ్ పెంటయ్య, జిల్లా ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లో సాగులో ఉన్న ఉద్యానవన పంటలను ఆశాఖ రాష్ట్ర సలహాదారు శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో లెమన్ అండ్ చిల్లీ ఫార్మ్‌లో హైడ్రోపానిక్స్ ద్వారా పండిస్తున్న క్యాప్సికమ్, కీరదోస పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ హరికాంత్, డాక్టర్ నితీష్ పాల్గొన్నారు.

కమిషనర్ కృష్ణారెడ్డికి ఘనంగా వీడ్కోలు



సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ అన్నారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న సదాశివపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జయమ్మ, వైస్‌చైర్మన్ చింతా గోపాల్ మాట్లాడుతూ కమిషనర్ కృష్ణారెడ్డి ఉద్యోగులు, కౌన్సిలర్లతో కలిసి విధినిర్వహణలో మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. భవిష్యత్‌లో మరింత పేరు గడించాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్లు నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి పరామర్శ



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

పటాన్‌చెరు టౌన్: ఇటీవల ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం బాధాకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ మహమ్మద్ తన్వీర్, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, హరే రామ హరేకృష్ణ ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు

ఇటీవల గుండెపోటుతో కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని డీఈఓ వెంకటేశ్వర్లు, పటాన్‌చెరు ఎంఈఓ రాథోడ్, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం పటాన్‌చెరు డివిజన్ ఆర్థిక కార్యదర్శి వినోద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కాశీనాథ్, పాల్గొన్నారు.

'అవినీతిపరులే తనను సస్పెండ్ చేశారు'

జహీరాబాద్ టౌన్: నిందలు మోపి అవినీతి పరులే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని ఎంఆర్ఎఫ్ కార్మిక సంఘం అధ్యక్షుడు, ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎంజీ రాములు వాపోయారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీలో ఉన్న తనను బీఆర్ఎస్‌లో చేరాలని మంత్రి హరీశ్‌రావు కోరారని, అదే సమయంలో మాజీ మంత్రి గీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరగా అభిమానుల సూచన మేరకు 10వేల మందితో బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పోలీస్ రాంచంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధూరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నాయకులు ఏసురత్నం, కిషన్, ప్రేమనందం, పూర్ణచంద్రరావు, లింగం, భాస్కర్, సురేశ్, మొగులయ్య, శివకుమార్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకాలు



సంగారెడ్డి టౌన్: క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



వట్‌పల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్



జహీరాబాద్ టౌన్‌లో..



నారాయణఖేడ్‌లో..

ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని సీఎం కేసీఆర్ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నష్టాల్లో ఉన్న ఆర్టీసీని సంస్కరణల బాటలో ముందుకు నడుపుతూ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని ప్రజాప్రతినిధులు, కార్మికులు కొనియాడారు. – సంగారెడ్డి న్యూస్ డెస్క్

భగీరథ నీళ్లు రావడంలేదని ఆందోళన

హత్నూర (సంగారెడ్డి): గత నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని హత్నూర మండలం సిరిపురం గ్రామపంచాయతీ ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రక్షిత మంచినీటి బోర్లకు సరఫరా అయ్యే విద్యుత్ లేకపోవడంతో మూడు రోజులుగా గ్రామంలో నీరు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించిన నీరు సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సర్పంచ్ విజయలక్ష్మి నరేందర్‌ను సంప్రదించగా బోరు మోటార్లకు సరఫరా అయ్యే విద్యుత్ స్తంభాలు పడిపోయాయని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో నీటి సమస్య ఉన్నమాట వాస్తవమేనని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

◆ విరాళం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో చేపట్టనున్న మత్స్యశాఖ భవన నిర్మాణానికి ఖాజిపల్లి చిరుమణి శ్రీనివాస్ ముదిరాజ్ మంగళవారం రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను మత్స్యశాఖ డైరెక్టర్ సుంకర బోయిన మహేష్ సన్మానించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధ్యక్షుడు రమేష్, వావిలాల సింగిల్ విండో డైరెక్టర్ నల్తూర్ పర్వతాలు, నాయకులు సత్యనారాయణ, రాజు, సాయికుమార్, మల్లేశ్, నాగరాజు, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

◆ 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

◆ బండి సంజయ్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వరగౌడ్ సన్మానించారు. మంగళవారం ఢిల్లీలో బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ సమస్యలు పరిష్కరించాలలి

జహీరాబాద్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐసీఈయూ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం స్థానిక బ్రాంచ్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విషయంలో విఫలమైందని విమర్శించారు

◆ బోధన నైపుణ్యంపై ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

సదాశివపేట(సంగారెడ్డి): ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ దండు అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆర్పీలు, సీఆర్పీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2 నుంచి 8 వరకు ఉపాధ్యాయులకు మౌళిక భాషా, గణిత సామర్థ్యాల సాధన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, రుద్రప్ప, తుకారం, ధనశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

పటాన్‌చెరు: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన పలువురికి మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచులు కృష్ణ, భాస్కర్‌గౌడ్, రవి, సీనియర్ నాయకులు రాజు పాల్గొన్నారు.

◆ ఘనంగా బోనాల ఊరేగింపు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మంబాపూర్‌లో మంగళవారం బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను సన్మానించారు.

◆ నియామకం

నారాయణఖేడ్: అఖిల భారత విరాట్ విశ్వకర్మ యూత్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా నిజాంపేట్ మండలం రాంరెడ్డి పేట్‌కు చెందిన రాజును నియమిస్తూ ఆసంఘం జిల్లా బాధ్యులు లక్ష్మీనరసింహాసేనాచారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా ప్రచార కమిటీ చైర్మన్‌గా సిర్గాపూర్ మండలం కడ్పల్‌కు చెందిన జైపాల్‌చారిని, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వడ్ల కాశీనాథ్‌ను నియమించారు.

◆ ఖేడ్ ఎస్ఐగా విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఎస్ఐగా విద్యాచరణ్‌రెడ్డిని నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. నారాయణఖేడ్ ఎస్ఐగా నెలరోజుల క్రితం నియామకమైన ఏడుకొండలు సీఐగా పదోన్నతిపై వెళ్లారు. వికారాబాద్ జిల్లా పెద్దెముల్ పీఎస్ నుంచి నాగల్‌గిద్ద ఎస్ఐగా పక్షం రోజుల క్రితం బదిలీపై వచ్చి విధులు నిర్వర్తిస్తున్న విద్యాచరణ్‌రెడ్డిని నారాయణఖేడ్ ఎస్ఐగా నియమించారు. ఖేడ్ రెండో ఎస్ఐగా వికారాబాద్ జిల్లా నుంచి శ్రీనివాస్‌ను నియమించారు. నాగల్‌గిద్ద ఎస్ఐ పటాన్‌చెరులో విధులు నిర్వర్తిస్తున్న సిద్ధిరాములును నియమించారు. సిర్గాపూర్ ఎస్ఐగా మహిపాల్‌రెడ్డిని నియమించారు. కంగ్టి ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణకు సీఐగా పదోన్నతి రావడంతో ఆయన స్థానంలో వికారాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న విశ్వజాన్‌ను నియమించారు.

◆ సభ్యత్వ నమోదుకు స్పందన

జహీరాబాద్ టౌన్: పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తుందని మండల అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, యూపీఎస్ 3, యూపీఎస్ రైల్వే కాలనీ, శాంతి నగర్, రాంనగర్, డ్రైవర్స్ కాలనీ, గడి 2బి, కసాబ్ గల్లి, అహ్మద్‌నగర్ కాలనీలోని పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. సంఘం నాయకులు శ్రీశైలం, వరాలు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్‌లో చేరికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ పుష్పలత మల్లేశం మంగళవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు నాగేష్, ఈశ్వర్, యాదగిరి, పెంటయ్య చేరారు.

◆ ఓటరు జాబితాపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: ఓటరు జాబితాపై అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నూతన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, మార్పుల చేర్పులపై చర్చించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి (రిటర్నింగ్ అధికారి) దేవుజ, తహసిల్దార్ పరమేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, అమరేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

◆ రుణమాఫీ అమలు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మునిదేవునిపల్లిలో మంగళవారం రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి, రైతు నాయకులు శ్రీనివాస్, గోపాల్, విష్ణు, చంద్రయ్య, మానయ్య పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వట్‌పల్లి (అందోల్): అందోలు–జోగిపేట మున్సిపాలిటీలోని 10వ వార్డులో సీసీ రోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ రేఖప్రవీణ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు గుర్రపు కృష్ణ, చిట్యాల మధు, ఆకుల నగేష్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ఎంపీడీఓ పర్యటన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లో మంగళవారం ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వనంలో మొక్కల పెంపకం, డంప్ యార్డును పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

◆ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి

రాయికోడ్(అందోల్): వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ అన్నారు. ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న యువకులు మంగళవారం జహీరాబాద్ ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులను అందజేశారు.